# ప్రజా సంక్షేమం మా ధ్యేయం

## పెప్సీకో ఛైర్మన్ మను ఆనంద్

సంగారెడ్డి అర్బన్ : ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని పెప్సీకో ఇండియా ఛైర్మన్ మను ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి మండలం చెర్యాల్‌లో సామాజిక జల వనరుల పథకం ప్రారంభం సందర్భంగా మాట్లాడుతూ.. నీటి వనరుల పునరుద్ధరణలో భాగంగా చెర్యాల్‌తో పాటు కాశీపురం, కొత్లాపూర్ గ్రామాల్లోని మూడు చెరువుల్లో 400 మిలియన్ల లీటర్ల నీటిని ఆదా చేసినట్లు పేర్కొన్నారు. వర్షపు నీటి కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 7500 మంది మహిళలకు స్వయం సహాయక బృందాల ద్వారా కుట్టు శిక్షణ ఇచ్చామని తెలిపారు. లీటరు బెవరేజ్ తయారీకి 2007లో 2.65 లీటర్ల నీటిని వినియోగిస్తే..2011లో దానిని 1.88 లీటర్లకు తగ్గించామని.. తద్వారా 564 మి.లీ. ఆదా చేసినట్లు వివరించారు.

### 21వ శతాబ్దంలో నీటి యుద్ధాలు: కలెక్టర్

స్వచ్ఛంద సంస్థలు గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ దినకర్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున వారికి ఎలాంటి సహకారం కావాలన్న అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. పల్లెలు అభివృద్ధి చెందినపుడే దేశం అభివృద్ధి చెందినట్లని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయం, రహదారులు, బడి, గుడి బాగుంటే చాలన్నారు. ఆరోగ్యం బాగుంటే దేనిలోనైనా రాణిస్తారని పేర్కొన్నారు. 21వ శతాబ్దంలో మంచి నీటి కోసం యుద్ధాలు జరిగే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఇప్పటినుంచి నీటిని వృథా చేయొద్దని సూచించారు. నీటి వనరుల కోసం డ్వామా ఆధ్వర్యంలో రూ.120 కోట్లు ఖర్చు చేసిన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పెప్సీకో ఈడీ వివేక్ భారత్, ఏడీఐ సంస్థ ప్రతినిధులు సీజర్, ఫల్సేర్కర్, తహశీల్దారు కిషన్‌నాయక్, కాశీపురం తాజా మాజీ సర్పంచ్ సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు. కుట్టు నేర్చుకున్న మహిళలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ దినకర్‌బాబు, పక్కన ఆనంద్